

పర్యాటక ప్రాంతాలను సందర్శించండి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పురాతన చరిత్ర కలిగిన కోటలు, తీర్థక్షేత్రాలు, ప్రకృతి పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించండి అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఇంటాక్ ఆధ్వర్యంలో "దర్శించండి.. ఆనందించడి.. తరించండి" అనే నినాదంతో పోస్టర్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. వజ్రోత్సవాల్లో భాగంగా జిల్లాలోని 115 దర్శనీయ స్థలాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేయాలని, జిల్లాలో పర్యాటక అభివృద్ధికి దోహదపడేలా అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.



కేదారిపురంలో గాంధీజీ చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

పంట దేవుడిగా.. గాంధీజీకి పూజలు

- కేదారిపురంలో గాంధమ్మ సంబరాలు
- ప్రారంభమైన ఖరీఫ్ పనులు

పలాసరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మ గాంధీజీని ఆ గ్రామంలో దేవతగా కొలుస్తారు. గాంధమ్మ పేరుతో ఆలయాన్ని నిర్మించారు. పంటలు సుభిక్షంగా పండాలని.. ఉడుపుల సమయంలో వరమిచ్చే దేవతగా పూజిస్తారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచీ ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పలాస మండలం కేదారిపురం గ్రామంలో మహాత్మగాంధీజీ కోసం ఆలయాన్ని నిర్మించి.. గాంధమ్మగా కొలుస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు, గ్రామపెద్దలు గాంధమ్మను పూజించి ఉడుపులు (వరినాట్లు నాటడం) ప్రారంభిస్తారు. ఈ మేరకు గురువారం గాంధమ్మ సంబరాలు నిర్వహించారు. గ్రామచావిడిలో మండపం వద్ద వివిధ వంటకాలు, గజం ముద్దను సమర్పించారు. పూలు, పళ్లతో గాంధీజీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. గాంధీజీ చిత్రపటానికి పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ సంకీర్తనలు ఆలపించారు. గాంధమ్మ ఆలయంతోపాటు గ్రామంలో అమ్మవార్లకు వంటకాలను సమర్పించి పూజలు చేశారు. పంటలు బాగా పండాలని కోరారు. అనంతరం ఖరీఫ్ పనులు ప్రారంభించారు. పూజలు చేసిన అనంతరం చిరుజల్లులు పడడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



కేదారిపురంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

లక్ష్యం.. నీరుగారుతోంది



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

- ఐదేళ్లలో కేవలం 27శాతం పనులు పూర్తి
- ఏకగ్రామ పథకానికి తూట్లు
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కట్లు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చాల్సిన గ్రామీణ నీటిసరఫరా విభాగం నిద్రావస్థలో ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. కానీ, జిల్లాలో గ్రామీణ నీటిసరఫరా విభాగం పనితీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వేసేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పనులు సక్రమంగా సాగడం లేదు. ప్రజలకు తాగునీటి సమస్యలు తప్పడం లేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

● జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఏకగ్రామ పథకం కింద జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 4,885 పనులకు రూ.2,794.77కోట్ల అంచనాలు రూపొందించారు. 2020 - 2025 నాటికి కేవలం రూ.1,417కోట్లు విలువైన 1,306 పనులు మాత్రమే పూర్తి చేశారు. ఐదేళ్లలో కేవలం 27శాతం పనులు మాత్రమే (మిగతా 6వ పేజీలో..)

పని వివరాలు	పనుల సంఖ్య	అంచనా విలువ (రూ.కోట్లలో)	2020-25లో ఖర్చు	పూర్తయినవి	ప్రగతిలో ఉన్నవి
ఏకగ్రామ పథకం (17 జీవో)	1,778	545.6	68లక్షలు	24	95
ఏకగ్రామ పథకం (73 జీవో)	2,336	1225.66	791.6 కోట్లు	967	1,186
ఏకగ్రామ పథకం (పీవీటీజీ)	26	2.93	---	---	---
హౌసింగ్ కాలనీ (17 జీవో)	14	2.17	11.52లక్షలు	2	12
హౌసింగ్ కాలనీ (73 జీవో)	131	35.24	9.90కోట్లు	---	131
జడ్పీ పనులు	598	18.14	7.89కోట్లు	312	233
ఉద్దానం ప్రాజెక్టు	1	700	606.82కోట్లు	1	---
ఉద్దానం ప్రాజెక్టు ఫేజ్-2	1	265	---	---	1

కట్టించారు.. వదిలేశారు!

- నిరుపయోగంగా నీటి తొట్టెలు
- అవసరం లేని చోట్ల నిర్మాణాలు
- రూ.కోట్లలో నిధులు వృథా
- కానరాని అధికారుల పర్యవేక్షణ



మందస మండలం కొండలోగాం పంచాయతీ కొయ్యాడి వీధిలో రూ.38 వేలతో (వాటర్‌షెడ్ నిధులతో) నిర్మించిన నీటి తొట్టె ఇది. ఖర్చు వివరాలతో సూచిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. కానీ ఇందులో చుక్క నీరు కూడా లేదు. చుట్టూ ముళ్ల పొదలు పెరిగి పశువులు అక్కడకు వెళ్లలేని పరిస్థితి. తొట్టెలో సైతం ముళ్లపొదలు వేసి వదిలేశారు. అయినా కనీసం అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా నీటితొట్టె నిరుపయోగంగా మారింది.



మందస మండలం సిరిపురంలో పదేళ్ల కిందట ఉపాధి నిధులతో నిర్మించిన నీటి తొట్టె ఇది. సుమారు రూ.32వేలతో దీనిని నిర్మించగా, ఒక్కరోజు కూడా ఉపయోగించిన పరిస్థితి లేదు. దీంతో వృథాగా మారి దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.

హరిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):

పశువుల దాహార్తిని తీర్చేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి తొట్టెలు నిర్మించారు. నీటితొట్టెల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులను మంజూరు చేసింది. ప్రతీ గ్రామంలో అవసరం మేరకు ఒకటి, రెండు తొట్టెలు చొప్పున నిర్మించినా.. అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. నిధులు దుర్వినియోగం తప్ప పశువులకు చుక్క నీరందించే పరిస్థితి కనిపించటం లేదు. జిల్లాలో ఉపాధి హామీతోపాటు వాటర్‌షెడ్ పథకం కింద సుమారు రూ.40కోట్లతో 1,250 వరకు నీటితొట్టెలు నిర్మించారు. ఒక్కోదానికి సుమారు రూ.32వేలు చొప్పున వెచ్చించారు. ఒక్క పలాస నియోజకవర్గం పరిధిలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని బహాడపల్లి, నారాయణపురం, దున్నూరు, బిన్నల, గంగువాడ, బేతాళపురం తదితర గ్రామాల్లో పదేళ్ల కిందట సుమారు 58 నీటితొట్టెలను నిర్మించారు. నేడు అవన్నీ నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల కిందట వాటర్‌షెడ్ పథకం కింద మూడు మండలాల్లో సుమారు 590 నీటితొట్టెలను నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లేక నెలరోజులకే కొన్ని శిథిలమయ్యాయి. నీటి సదుపాయంలేక మరికొన్ని దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు జేబులనింపుకొనేందుకు తప్ప వీటితో (మిగతా 6వ పేజీలో..)

నీరు లేని తొట్టెందుకు?

హిరమండలం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో రూ.33వేలతో నిర్మించిన పశువుల నీటితొట్టె వృథాగా దర్శనమిస్తోంది. తొట్టెకు కనీసం పథకం పేరు, వివరాలు కూడా నమోదు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటివరకు తొట్టెకు తాగునీటి పైపు కనెక్షన్ ఇవ్వలేదు. అలాగే నిర్మాణంలో కూడా నాణ్యత పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు లేని తొట్టెందుకు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హిరమండంలో నిరుపయోగంగా పశువుల నీటి తొట్టె

వజ్రోత్సవం విజయవంతం చేయాలి

- జిల్లా చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు
- అధికారులంతా సమన్వయంతో వ్యవహరించాలి
- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా 75 వసంతాల వేడుకలకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లను చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా, చరిత్ర, సంస్కృతి, ప్రత్యేకతలను ప్రతిబింబించేలా అంతా కలిసికట్టుగా వేడుకలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. జిల్లాలో సహజ వనరులు, టూరిజం ప్రాంతాలు, సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేలా కార్యక్రమాలను రూపొందించి, ప్రదర్శించాలని సూచించారు. దీనికి సంబంధించి ఆహ్వాన కమిటీ, సావనీర్ కమిటీ, సాంస్కృతిక కమిటీ, ఆతిథ్య కమిటీలను ప్రకటించారు. ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో శోభాయాత్రకు బదులు 5వేల మందితో వాక్‌థాన్, యువజన గ్రామీణ క్రీడలు, సదస్సులు, విద్యార్థుల కోసం జిల్లా చరిత్రపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. అలాగే ఫైలాన్, సావనీర్ ఆవిష్కరణ, ఆదివాసీ కళల ప్రదర్శన, డ్వాక్రా బజార్, 28రకాల స్టాల్స్ ప్రధాన (మిగతా 6వ పేజీలో..)



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

జిల్లా విద్యాశాఖకు దిక్కెవరు?

- వారం రోజులుగా ఇన్‌చార్జిలతో నిర్వహణ
- పూర్తిస్థాయిలో అధికారి నియామకం ఎప్పుడో..

నరసన్నపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖకు ఉన్నతాధికారి కరువయ్యారు. డీఈవోగా పనిచేసిన ఎస్.తిరుమల చైతన్య గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పటికి వారం రోజులు గడిచినా ఆయన స్థానంలో ఎవరినీ (మిగతా 6వ పేజీలో..)

సిఫారసుకు చెల్లు.. ప్రతిభకు పట్టం

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మార్గదర్శకాలు
- నేటితో ముగియనున్న దరఖాస్తు ప్రక్రియ
- తొలిసారిగా ఈ నెల 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

6లో

శిలాఫలకాలు ధ్వంసం చేసిన దుండగులు

8లో



మాట్లాడుతున్న విరసం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

శ్రీకాకుళం సాయుధ పోరాటం ప్రత్యేకం

- ఈ పోరులో చిరస్మరణీయురాలు సురేఖపాణిగ్రాహి
- విప్లవ రచయితల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ

8లో



శ్రీకాకుళంలో చేనేత మహిళల ఆనందోత్సాహం

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

7లో

నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి

- డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా "అక్షర ఆంధ్ర" కార్యక్రమాన్ని రూపొందించినట్లు డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాలో ఈ ఏడాది 1,12,071 మంది నిరక్షరాస్యులను గుర్తించాం. వీరికి 11,207మంది వలంటీర్లు, ఉపాధ్యాయులు విద్యను బోధిస్తారు. నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు పాఠశాల తరహాలో తరగతులను నిర్వహించి, వచ్చే మార్చినాటికి వారిని పరీక్షలకు సిద్ధం చేయాల'ని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకరరావు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి అరుంధతీ దేవి, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, మండలాల అభివృద్ధి అధికారులు, వెలుగు సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, ఉపాధిహామీ శాఖ అధికారులు, మెప్మా సమన్వయకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్



నేడు వరలక్ష్మీ వ్రతం

శ్రీకాకుళం పొట్టిశ్రీరాముల మార్కెట్‌లో రద్దీ

శ్రావణ శోభ

- పండ్లు, పూల ధరలకు రెక్కలు
- కళకళలాడిన బంగారు, వెండి ఆభరణాలు, వస్త్ర దుకాణాలు
- మార్కెట్లలో రద్దీ

6లో

శ్రావణ శోభ

- పండ్లు, పూల ధరలకు రెక్కలు
- కళకళలాడిన బంగారు, వెండి ఆభరణాలు, వస్త్ర దుకాణాలు
- మార్కెట్లలో రద్దీ


శ్రీకాకుళంలో పెద్దమార్కెట్‌లో కిటకిట.. పూజాసామగ్రిని కొనుగోలు చేస్తున్న జనం..

శ్రీకాకుళం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు శ్రావణ శోభ సంతరించుకుంది. నేడు శ్రావణ శుక్రవారం కావడంతో వరలక్ష్మీ వ్రతాలకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఈ వ్రతానికి హిందూ సంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. సంపద, ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ వరలక్ష్మీ దేవిని పూజిస్తారు. పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీగా మారాయి. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ఇదిలా ఉండగా..శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని వివిధ దేవాలయాల్లో భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీకాకుళంలో సూర్యనారాయణ స్వామి ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం.. ఇలా అన్ని ఆలయాలలో భక్తులు సామూహిక పూజలలో పాల్గొనేందుకు టిక్కెట్లు అందుబాటులో ఉంచారు.

పూల ధరలకు రెక్కలు..

వరలక్ష్మీ వ్రతాలకు ప్రజలు సిద్ధమవుతుండడంతో పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. కనకాంబరాలు 25 గ్రాములు రూ.60 చొప్పున గురువారం విక్రయించారు. బంతి, చామంతి, గులాబీలు వంద గ్రాములు రూ. 80కు విక్రయిస్తున్నారు. ఇక పండ్ల ధరలు రెట్టింపయ్యాయి. శ్రీకాకుళం పెద్ద మార్కెట్‌తో సహా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వెండి, బంగారు ఆభరణాల దుకాణాలు సైతం కిటకిటలాడాయి. ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట, పలాస కాశీబుగ్గ వంటి పట్టణాలలో శ్రావణ శోభ సంతరించుకుంది. ఇదిలా ఉండగా... నేడు ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు ప్రకటించాయి.


శ్రీకాకుళంలో ఓబీఎస్ వద్ద బస్సుల కోసం జనాలు.. తోపులాట


నరసన్నపేటలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బంగారం షాపు


వరలక్ష్మీ వ్రతానికి సిద్ధం చేసిన లక్ష్మీదేవి కాసులు

బంగారు దుకాణాలు కళకళ..

నరసన్నపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు క్రితం ప్రభుత్వం అన్నదాత సుఖీభవలో ప్రతిరైతు ఖాతాకు రూ.7వేలు చొప్పున జమ చేసింది. చాలా మంది మహిళలు ఈ సొమ్ముతో అర గ్రామ లక్ష్మీదేవి రూపు చేయించుకుంటున్నారు. దీంతో జిల్లాలోని అన్ని బంగారం దుకాణాల్లో పండుగ కళ సంతరించుకుంది. ధరతో నిమిత్తం లేకుండా సెంటిమెంట్‌గా ప్రతిమను తీసుకుంటున్నారు. వీటితో పాటు నల్లపూసలు, ఇతర వస్తువులు చేయించుకుంటున్నారు. కాగా గత ఏడాది గ్రాము ఆర్నమెంట్ బంగారం ధర రూ.6,500 పలుకగా, ఈ ఏడాది రూ.9,300కి చేరింది. తరుగు, మేకింగ్ చార్జీలతో కలిపి గ్రాము ప్రతిమ రూ.9,600 అవుతుంది. అదే అర గ్రాముతో లక్ష్మీదేవి ప్రతిమ రూ.5వేల వరకు పలుకుతోంది. ఎక్కువగా ఇవే అమ్ముడువుతున్నాయి. ముందుగా మార్కెట్‌ను అంచనా వేసిన వ్యాపారులు వీటినే ఎక్కువగా స్టాక్ పెట్టారు. కాసులు విక్రయాలకు ఆఫర్లు ప్రకటించారు.

అబ్బో ఎన్ని పుట్టగొడుగులో..



వజ్రపుకొత్తూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు ఉద్దానంలో ఎక్కువగా పుట్టగొడుగులు పుట్టుకొస్తుంటాయి. తోటలు ఎక్కువగా ఉండడంతో రుచికరమైన పుట్టగొడుగులు లభ్యమవుతుంటాయి. ఈ ప్రాంత పుట్టగొడుగులకు మంచి డిమాండ్ ఉంది. కొంతమంది వీటిని సేకరించి బయట మార్కెట్‌లో కిలో రూ.500పై బడి అమ్ముకుని సొమ్ము చేసుకుంటుంటారు. ఇవి సహజ సిద్ధంగా భూమిలోపల నుంచి పుట్టడం ద్వారా రుచితోపాటు ఆరోగ్యం ఉంటుందని ఈ ప్రాంత వాసులు చెబుతుంటారు.


బాతుపురంలోని ఓ తోటలో పుట్టగొడుగులు



పంటల సాగు తెలుసుకుందాం

- క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరిశీలన

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ తరగతి గదులకు, పుస్తకాలకే పరిమితమయ్యే విద్యార్థులు వ్యవసాయ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సందడి చేశారు. రైతులు ఏ విధంగా పంటలు సాగు చేస్తున్నారు.. ఎలా నాట్లు వేస్తున్నారు.. తదితర విషయాలు తెలుసుకునేందుకు నగరంపల్లి హైస్కూల్ విద్యార్థులు గురువారం పొలంబాట పట్టారు. 8వ తరగతిలో ఉన్న 'పంటల ఉత్పత్తి' అనే పాఠ్యాంశంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులను తీసుకువచ్చినట్టు సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. నేల చదును చేయడం, విత్తనాలు జల్లడం, నాట్లు వేయడం తదితర అంశాలపై విద్యార్థులు తెలుసుకున్నారని హెచ్‌ఎం టి.హేమారావు చెప్పారు.

సిఫారసుకు చెల్లు.. ప్రతిభకు పట్టం

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మార్గదర్శకాలు
- నేటితో ముగియనున్న దరఖాస్తు ప్రక్రియ
- తొలిసారిగా ఇంటర్వ్యూలతో ఎంపిక
- 21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు

నరసన్నపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అవార్డులకు గతంలో సిఫార్సులకు ప్రాధాన్యం ఉండేది. క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడి.. ప్రతిభను చాటిన ఉపాధ్యాయులు అవార్డులకు దూరంగా ఉండేవారు. అలాంటి వారిని గుర్తించి.. వారి ప్రతిభే కొనమానంగా ఉత్తమ అవార్డుల ఎంపికకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏటా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 5న దేశవ్యాప్తంగా గురుపూజోత్సవాన్ని ఓ పండుగగా జరుపుకుంటాం. ఈ సందర్భంగా గురువులను సన్మానించుకుంటాం. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న వారిని జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి పురస్కారాల ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న విధానాన్ని ప్రభుత్వం మార్చింది. ఇందుకు సంబంధించి 100 పాయింట్లకు 17 అంశాలను పరిగణలోకి తీసుకోనుంది. అంతేగాక ఇంటర్వ్యూలను ప్రవేశ పెట్టింది.

మూడు రకాల దరఖాస్తులు..

- ఉపాధ్యాయులుగా పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. సాధించిన విజయాలు, నూతనావిష్కరణలో విద్యార్థుల ప్రగతి.. సమాజం, పాఠశాల ప్రగతికి చేసిన కృషిని వివరిస్తూ తగు ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- రెండో అంశంగా కొంతమంది టీచర్లు వెలకట్టలేని సేవలు అందిస్తున్నా అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోరు. పొగడ్తలు, గొప్పలు చెప్పుకోవడం ఇష్టం ఉండదు. అటువంటి టీచర్లను గుర్తించి కనీసం ఐదుగురు తమ సహచర టీచరు గురించి దరఖాస్తు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.
- మూడో అంశంగా సమస్త సేవలే, లీప్ యాప్‌ల అంశాలను పరిశీలించి ప్రభుత్వమే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికకు 100 పాయింట్లలో 17 అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. పాయింట్లు ఎక్కువ సాధించిన వారిని ఎంపిక చేస్తుంది.

21 నుంచి 23 వరకు ఇంటర్వ్యూలు..

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక కోసం ఈఏడాది కొత్తగా ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టారు. గత ఏడాది వరకు టీచర్లు దరఖాస్తుల్లో చేసుకున్న అంశాలను మాత్రమే పరిశీలించేవారు. ప్రస్తుతం 100 ప్రతిభ పాయింట్లతో పాటు ఇంటర్వ్యూలో కూడా ప్రతిభ చూపిన వారినే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేస్తారు. విద్యా డివిజన్, జిల్లా స్థాయిలో ఉత్తములుగా ఎంపికై రాష్ట్ర స్థాయికి వెళ్లిన వారిని వారి ప్రతిభా పాఠశాల ఆధారంగా అవార్డులకు ఎంపిక చేస్తారు. ఆసక్తి గల టీచర్లు ఈ అవార్డులు కోసం దరఖాస్తు గడువు ఈనెల 8 అంటే శుక్రవారం ముగియనుంది.

పాయింట్లు ఇలా..

ఉపాధ్యాయుల ఉన్నత విద్యార్హతలకు 2 పాయింట్లు, సర్వీసుకు 6 పాయింట్లు, టీచర్ సబ్జెక్టులో ఉత్తీర్ణత శాతానికి పది, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యానికి 2, విద్యార్థి ప్రమాణాల పెంపునకు చేసిన కృషికి 5 పాయింట్లు కేటాయించారు.


శిక్షణ కేంద్రం ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

పోలీసు శిక్షణ కేంద్రాన్ని సిద్ధం చేయండి

- ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలస గ్రామంలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ఆదేశించారు. గురువారం ఈ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇటీవల ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణ త్వరలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో అవసరమైన మౌలిక వసతులపై ఆయన సమీక్ష నిర్వహించారు. శిక్షణ కేంద్రంలోని మైదానం, తరగతి గదులు, బ్యారెక్స్, మంచి నీటి సరఫరా, మెస్, భోజన ప్రాంతం, స్నానాల గదులు, విద్యుత్, తదితర మౌలిక వసతులను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, కావలసిన వస్తు సామగ్రి కోసం నివేదికలను పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావుతో కలసి సూచనలు చేశారు. శిక్షణ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్శనలో సీఐలు ఇమ్మాన్యుయల్ రాజు, పైడిపునాయుడు, అవతారం, ఆర్ఐలు నర్సింగరావు, శంకర్ ప్రసాద్, ఎస్ఐలు రవి కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కట్టించారు.. వదిలేశారు!

(ఐదో పేజీ తరువాయి)

ఎటువంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. కొన్నిప్రాంతాల్లో అవసరం లేనిచోట్ల వీటిని నిర్మించారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటితొట్టెలను వినిగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పశువులు లేని గ్రామాల్లో నిర్మాణం..



గ్రామాల్లో నిర్మించిన నీటితొట్టెలు ఎటువంటి ప్రయోజనం లేకపోగా.. నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో పది పశువులు లేని వద్ద వీటిని నిర్మించటంతో వృథాగా మారాయి.

-మండల లచ్చయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, అంబుగాం

నీటి సదుపాయమేదీ?



నీటితొట్టెలు పేరుతో అధికారులు, గ్రామస్థాయి నాయకులు కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి కొంతమేర నిధులు నొక్కేశారు. ప్రభుత్వం ఉన్న తాశయం నీరుగారిపోయింది. గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇవి దర్శన మిస్తున్నాయి. కనీసం నిర్మించిన వాటికి నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

-కర్రి గోపాలకృష్ణ, సర్పంచ్, జీఆర్‌పురం

వినియోగంలోకి తెస్తాం..



ప్రస్తుతం సుమారు 30 నీటితొట్టెలు నిర్మాణంలో ఉన్నాయి. అన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తేనే బిల్లులు చెల్లిస్తాం. రైతులకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం వీటిని నిర్మిస్తోంది. అన్నింటినీ పరిశీలించి నీటి సదుపాయం కల్పించి వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం.

-ఎన్.హరికృష్ణ, ఏపీవో, ఎన్ఆర్‌జీఎస్, మందస

జిల్లా విద్యాశాఖకు దిక్కెవరు?

(ఐదో పేజీ తరువాయి)

నియమించలేదు. జిల్లాలో విద్యాశాఖను నడిపించే నాయకుడు లేక.. ఎవరిదారి వారిదే అన్న చందంగా ఉపాధ్యాయుల పరిస్థితి ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలి రెండురోజుల పాటు ఇన్‌చార్జిగా రవి కుమార్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సెలవులో ఉన్నారు. ప్రస్తుతం శ్రీనివాసరావు ఆ బాధ్యతలను స్వీకరిస్తున్నారు. అయితే విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో.. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో అనేక సంస్కరణలకు బాటలు వేశారు. ఈ నెల 11 నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ -1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఉపాధ్యాయుల ప్రతిభ ఆధారంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసే పక్రియకు గడువు తరుముకొస్తోంది. అలాగే ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు విద్యార్థులకు ఉచితంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లను ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. పాఠశాలలు పర్యవేక్షణ, పంద్రాగస్టు వేడుకల నిర్వహణ చేపట్టాల్సి ఉంది. డీఈవో తరువాత స్థానంలో ఉన్న అధికారులు ఈ తంతు నిర్వహిస్తున్నా.. విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడంలో కాలయాపన జరిగే అవకాశం ఉంది. కాబట్టి పూర్తిస్థాయిలో డీఈవోను నియమించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు..

లక్ష్యం.. 'నీరు'గారుతోంది

(ఐదో పేజీ తరువాయి)

పూర్తి చేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని చెప్పవచ్చు. నేటికీ 1,921 పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 1,658 పనులు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. ఉద్దానం ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా ఒక పనిని గుర్తించారు. దీనికిగాను రూ.265కోట్లు అంచనా వేయగా, ఈ పని కనీసం ముందుకు సాగకపోవడం గమనార్హం. ఇటీవల పలు సమావేశాల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా వారిలో చలనం లేకపోవడం గమనార్హం. జరిగిన పనులకు సంబంధించిన బిల్లుల్లో కమీషన్లు తీసుకోవడానికి మాత్రమే ఈ శాఖ పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- **వచ్చే మార్చిలోగా పూర్తి చేస్తాం**

వచ్చే ఏడాది మార్చిలోగా అన్ని పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపు పూర్తయిన వెంటనే మిగిలిన పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-ప్రభాకరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

వజ్రోత్సవం విజయవంతం చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ప్రత్యేకంగా మన జిల్లాకు మాత్రమే పరిమితమైన వంటలు, గ్రామీణ పోటీల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రచార కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాకు ఘనకీర్తి తీసుకువచ్చిన మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధులు, కీర్తిశేషుల జీవిత చరిత్రలను సావనీర్‌లో పొందుపరచాలన్నారు. అరసవల్లి రథసప్తమి ఉత్సవాల మాదిరి వజ్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డ్వామా పీడీ సుధాకర్, ఆర్డీఓ సాయిప్రత్యూష, డీపీఓ భారతీ సౌజన్య, సీపీఓ లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలు రంగాల ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం కాదు..

అరసవల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ ఆటోలు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఏ బస్టాండ్ వద్దో, స్కూల్ వద్దో ప్రయాణికుల కోసం ఇలా ఉన్నాయని అనుకుంటే పొరబాటే. ఇప్పుడు వర్షాకాలమే అయినా ఎండలు, ఉక్కపోత వేసవిని తలపిస్తున్నాయి. దీంతో ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యమై పోతున్నాయి. మండే ఎండలకు తోడు, వాతావరణంలో తేమ శాతం పెరగడంతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రయాణికులు లేక ఖాళీ రోడ్లపై వృథాగా తిరగలేక నగరంలోని ఆటోడ్రైవర్లు.. తమ వాహనాలను 80 అడుగుల రోడ్డులో ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కింద నిలబెట్టుకుని సేదతీరుతున్నారు.


స్థానిక 80 అడుగుల రోడ్డులో చెట్ల నీడన ఆటోలు


చెట్టు నీడలో సేదతీరుతున్న ఆటో కార్మికులు

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే శంకర్



రాట్నాన్ని ఒడుకుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్


చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న దృశ్యం

అరసవల్లి/పాత శ్రీకాకుళం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్ గురువారం జరిగిన చేనేత దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు నేతన్న భరోసాను రూ.24వేల నుంచి రూ.25 వేలకు పెంచారని, మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. చేనేత వస్త్రాలు ఇ కామర్స్ ద్వారా అమ్మేందుకు, నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ, హ్యాండ్లూమ్స్ ఏడీ టి.జనార్దన్ రావు, రెడ్ క్రాస్ సెక్రటరీ జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గాంధీతోనే చేనేతకు ప్రాచుర్యం

పొందూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీతోనే చేనేత, ఖాదీవ స్త్రాలకు దేశంలో ప్రాచుర్యం లభించిందని ఎస్ఐ వి.సత్యనారాయణ, డీటీ శ్రీధర్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం ఖాదీ వస్త్రాలయం సంస్థ సీనియర్ చేనేత కార్మికునికి నిర్వహించిన సన్మానం, గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికుడు చందన అప్పారావును దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ వస్త్రాలయం అధినేతలు బి.ప్రతాప్, బి. కృష్ణారావు, జామి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లోలుగు విద్యార్థినులు


విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ

పొందూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సౌత్‌జోన్ స్టేట్ అథ్లెటిక్ మీట్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన పోటీలలో అండర్-18 విభాగంలో ఎం.దాక్షాయిని షాట్‌పుట్‌లో మొదటిస్థానం, అండర్-16 విభాగంలో డి.హాసిని షాట్‌పుట్‌లో మొదటిస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌమ్య, పీడీ రూప తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు చీరాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


ఇచ్ఛాపురం చేరుకున్న అభిరామ్

ఇచ్ఛాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఒడిశాలోని దుర్లంఘ గ్రామానికి చెందిన అభిరామ్‌సత్‌పతి(68) అన్నారు. వ్యాయామంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నారు. ఈమేరకు గురువారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. 2023 మే 25న ఒ పాదయాత్ర మొదలు పెట్టినటుట్ల చెప్పారు. పశ్చిమ బెంగాల్, అసోం తదితర ప్రాంతాలలో పర్యటించినట్టు తెలిపారు. తమిళనాడు మీదుగా మన రాష్ట్రానికి చేరుకున్నట్టు తెలిపారు. ఆయనకు స్థానికులు స్వాగతం పలికారు. ఇప్పటి వరకు 13,415 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేశానని తెలిపారు.

విప్‌ను కలిసిన బ్రాహ్మణ సంఘం నేతలు

సోంపేట, ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘ నేతలు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను ఆయన స్వగృహంలో గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మద్దు కుమార్, గోవింద్ పాణిగ్రాహి, గాంధీ పాణిగ్రాహి, సూర్యం పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై సర్వే


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

జి.సిగడాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం పంచా యతీ పరిధిలోని సర్వే నెంబర్ 29/6లో గల ఆక్రమణలపై గురువారం మండల రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. స్థానిక ఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణదారులు కొంత భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, అటువంటి ఆక్రమణలు తొలగించాలని గ్రామానికి చెందిన దారబోయిన ధర్మరాజు ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన పిర్యాదు మేరకు సుమారు 29 సెంట్లలో సర్వే చేపట్టి హద్దులను నిర్ణయించారు. ఆక్రమణలను తొలగించి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పిర్యాదుదారుడు ధర్మరాజు అధికారులను కోరారు. ఈ సర్వేలో ఆర్ఐ ఆబోతుల రాధ సర్వేయన్ శాంతారాం, వీఆర్వో దుర్గయ్య పాల్గొన్నారు.

యోగాలో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల, ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి): నరసన్నపేటలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ మాట్లాడుతూ వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కనబర్చాలన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు 29 బంగారు, ఆరు రజత పతకాలు గెలుచుకున్నట్టు చెప్పారు. వారందరినీ గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో డా.ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, వాసు, రవి గేదెల, యోగా శిక్షకులు ఈశ్వరరావు, అర్చన, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడ పాఠశాలకు కంప్యూటర్లు పంపిణీ


ఉపాధ్యాయులకు కంప్యూటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్రం నిర్మించ తలపెట్టిన నుంచి ఆ గ్రామానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు కావడం లేదు. దీంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. అక్కడ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. 'ఆ నాలుగు గ్రామాలు అంతేనా?' అనే శీర్షిక న 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వెలువడిన కథనంపై రోటరీ క్లబ్ ఆఫ్ సైబరాబాద్ ప్రతినిధి పసిని వెంకటసత్యంనారాయణ స్పందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ సైబరాబాద్ సౌజన్యంతో కొవ్వాడ, ఎన్‌జీఆర్ పురం ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరు చేశారు. గరువారం స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిని జగన్నాథంనాయుడు, హరికృష్ణ, దన్నాన స్వామినాయుడు, మైలపల్లి పోలీసు, అప్పారావు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంచిలి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివని సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీఓ కె.వసుందర అన్నారు. తల్లిపాల వారోత్సవా లను గురువారం ప్రాజెక్ట్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ..గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కోసం ప్రత్యేక కేంద్రం


లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

అరసవల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ 'వీర్ పరివార్ సహాయత యోజన - 2025' అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా గురువారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లో ప్యానెల్ లాయర్, పారా లీగల్ వలంటీర్‌ను నియమించామని చెప్పారు. వీరి సేవలను సైనికులు, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, న్యాయవాదులు వి.జ్యోతిర్మయి, ఇందిరాప్రసాద్, మాజీ సైనికులు కెప్టెన్ పి.ఈశ్వరరావు, ఎస్ఎస్‌మూర్తి, కె.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో న్యాయవాదుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

అరసవల్లి, ఆగస్టు 7 (ఆంధ్ర జ్యోతి): లోక్ అదాలత్ విజయవంతంలో న్యాయవాదుల పాత్ర కీలకమని అదనపు జిల్లా న్యాయాధికారులు సీహెచ్.వివేకానంద శ్రీనివాస్, ఎం.ఫణికుమార్, డీఎస్ఎల్ఏ సెక్రటరీ హరిబాబు అన్నారు. సెప్టెంబరు 9న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్ అధ్యక్షతన న్యాయవాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పి.దామోధరరావు, ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు, త్రిపురాన వరప్రసాద్, బీసీ న్యాయవాదుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి, ఎన్ని సూర్యారావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, పీవీ రమణ దయాల్, వాన కృష్ణచంద్, ఎన్.విజయకుమార్, అన్నంనాయుడు, ప్రసన్న కుమార్, కుసుమ, కుష్బూ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని దూరం చేయొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐఎం ఎల్‌డిపో కార్మికుల ఉపాధిని దెబ్బ తీయొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో మరో డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్మికుల ఉపాధి ని కాపాడాలని కోరుతూ ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ ఎచ్చెర్ల డిపో వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఖాళీ పేట్లు పట్టుకుని ధర్నా చేశారు. ఈ డిపోపైనే ఆధారపడి ఉపాధి పొందుతున్న 80 దళిత, పేద కుటుంబాలకు చెందిన హమాలీలకు తగినంత ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ధర్నాలో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగారరాజు, టి.రామారావు, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


పూజలు చేస్తున్న భక్తులు

రణస్థలం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీకృష్ణ చైతన్య మఠము గోసేవా ఆశ్రమంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు ఈనెల 18వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా రాధా గోకులానంద స్వామి వారికి గురువారం సాయంత్రం సంధ్యా హారతి, ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ న్యూ జనరేషన్ మంత్ సంద ర్భంగా రెండో రోజు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎస్.లక్ష్మి, కావ్య, వెన్నెలలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ మోహన్, కార్యదర్శి రామకోటి, న్యూ జనరేషన్ మంత్ చైర్మన్ రామారావు, సభ్యులు పి.దినేష్, కృష్ణమూర్తిరెడ్డి, తులసీదాస్, షన్ముఖరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పాఠశాల ఆవరణలో బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, మహిళా భద్రత, శక్తియాప్ ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని... వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఆపదలో ఉన్నపుడు 112, 1930, 1098 టోల్ ఫ్రీ నెంబర్లుకు ఫోన్ చేసి తక్షణమే రక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, పాఠశాల సీఈఓ జోహర్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అవగాహన అవసరం

ఎచ్చెర్ల, ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ అవతారం తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎచ్చెర్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన సురక్ష క్యాంపెయిన్, సైబర్ ఫ్రాడ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ పైడి రాజా మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, డైరెక్టర్ రాంజీ, బ్యాంకు మేనేజర్ శేషగిరి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

గారలో...

గార రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శక్తియాప్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. ఎతివాడ జిల్లా పరిషత్తు పాఠశాలలో గురువారం నారీ శక్తి సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో లేనిపోని పరిచయాలు పెంచుకోవద్దని... చదువుపై శ్రద్ధ పెట్టాలని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడంపై దృష్టి పెట్టాలి

ఎచ్చెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐఆర్ ఏపీఎస్పీ ఒకటో బెటాలియన్ కమాండెంట్ సిహెచ్.వి.ఎస్.పద్మనాభరాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసు క్వార్టర్స్ వద్ద పాఠశాల విద్యార్థులతో గురువారం మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగం ద్వారా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు టి.నాగశ్రీనివాసరావు, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

11న క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా జిల్లా లోని వివిధ నియోజకవర్గ స్థాయిల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్ తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 11న నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల కోసం నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్టు చెప్పారు. వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు.

గణపతి ఉత్సవాలకు శుభరాట

అరసవల్లి, ఆగస్టు 07(ఆంధ్రజ్యోతి): నగరంలోని తుమ్మావీధి మెహర్‌బాబా మందిరం సమీపంలో 18 అడుగుల గణపతి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గురువారం పందిరిరాట వేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ డబ్బీరు సుమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, రమాదేవి, మాధురి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి 10న సత్కారం

గార, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం క్షేత్రంలో గోడల మీద ఉన్న ప్రాచీన కుడ్య చి త్రాలను పునఃసృష్టిచేసిన మంచెం సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఈనెల 10న సత్కరించనున్నారు. మూడేళ్ల పాటు శ్రమించి వీటిని ఆయన రూపొందించారు.

టీటీడీ ఆధ్వర్యంలో నేడు 'సౌభాగ్యం'

ఎచ్చెర్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి) హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన శుక్రవారం సౌభాగ్యం అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. కుంచాల కూరమయ్యపేటలోని ఏకోత్తర శ్రీచక్రపీఠం దేవీ ఆశ్రమంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన కార్య క్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు ఎం.లలితమణి తెలిపారు.



పబ్లిక్ నోటీసు

నా క్లయింటు పలాస పట్టణ కాపురస్తులు అందవరపు కిషోర్‌కుమార్ గారి భార్య శ్రీమతి అందవరపు అనురాధ గారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు.

పలాస మండలం, ఉదయపురం గ్రామ కాపురస్తులు దేవరశెట్టి కృష్ణమూర్తి గారి కుమారుడు నేతాజీగుప్తా గారి స్వాదీన హక్కు అనుభవంలో గల ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని అతని నుండి నా క్లయింటు కొనుగోలు చేయుటకు ప్రతిపాదించియున్నారు. సదరాస్తికి సంబంధించిన తేది: 18-12-2002 కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు దస్తావేజు నెం. 2698/2002 గల రిజిష్టర్ సెటిల్‌మెంట్ డీడ్ మరియు దాని లింకు డాక్యుమెంటు డిటో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు దస్తావేజు నెం. 2697/1978 గల రిజిష్టర్ క్రయచీటీల ఒరిజినల్‌లను సదరు దేవరశెట్టి నేతాజీగుప్తా పోగొట్టుకున్నారని నా క్లయింటుకు తెలియజేసియున్నారు. కావున సదరు ఆస్తిపై వేరెవరికీ ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రసురింపబడిన 7 రోజులలోగా వారి యొక్క ఆక్షేపణలను నాకు గాని, నా క్లయింటుకు గాని తెలియజేయవలెను. లేని యెడల సదరాస్తిపై వేరెవరికీ యెట్టి హక్కులు లేవనియున్ను మరియు సదరాస్తిని సదరు దేవరశెట్టి నేతాజీ గుప్తా గారు నా క్లయింటుకు క్రయపరుచుటకు ఎవ్వరికి ఎట్టి అభ్యంతరములు లేవనియున్నూ భావించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: పలాస మండలం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, ఉదయపురం గ్రామం సర్వేనెం. 325/1 కె.టి.రోడ్‌కు పశ్చిమ దిశలో డోర్‌నెం. 2-15-1473 అసెస్‌మెంట్ నెం. 1084003739 గల తూ॥ప॥లకు 55అడుగులు, ఉ॥ద॥లకు 11 అడుగులు అనగా 67.22 చ॥గ॥ల స్థలంపై నిర్మించబడిన డాబా ఇంటికి **హద్దులు:** **తూ॥:** కె.టి.రోడ్డు మార్జిన్, **ద॥:** అందవరపు అనురాధ తాలూకా డాబా ఇల్లు, **ప॥:** బోయిన వేంకటరమణ గారి ప్రహరీ గోడ, **ఉ॥:** తంగుడు లేటు విజయలక్ష్మి గారి డాబా ఇల్లు.

రత్నాల శ్రీనివాసరావు B.Com, D.P.M., B.L.
అడ్వకేట్, గాంధీనగర్-2, పలాస - 532 221, సెల్: 9490557171





అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


నల్లి రాజు(ఫైల్)

పాతపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాతపట్నం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మొండిగొల్లవీధికి చెందిన నల్లి రాజు(34) స్థానిక ఎస్సీ వీధి శివారులో విగతజీవిగా పడివున్నాడు. బుధవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో భోజనం చేసిన తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు తిరిగి రాలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఎస్సీవీధి మీదుగా మహేంద్రతనయ నదివైపు వెళ్లిన కొంతమంది విగతజీవిగా ఉన్న రాజును గుర్తించి సమీప పొలాల్లో ఉన్న రైతులకు తెలియజేశారు. దీంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి నల్లి రాజుగా గుర్తించి అతడి పెద్దనాన్న నల్లి రాజారావుకి తెలియజేశారు. వెంటనే కుటుంబ సభ్యులతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రాజును స్థానిక సామాజిక ఆసుపత్రికు తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వి.రామారావు.. పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు బి.లావణ్య, రమేష్‌నాయుడు, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజుకు చెందిన ద్విచక్ర వాహనం ఘటన స్థలంలోనే ఉండడంతోపాటు సమీపంలోనే అతడి చెప్పులు పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఇది హత్యా?.. లేక ఆత్మహత్యా? అన్న కోణాల్లో విచారణ చేస్తున్నారు. రాజు సెల్ ఫోన్ గురువారం వేకువ జాము 3.45 గంటల వరకూ వినియోగంలో ఉన్నట్టు గుర్తించారు. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం చేరుకొని పరిశీ లించారు. టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజు కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు.. మృతదేహాన్ని ఫోరెన్సిక్ పరీక్షలకు, పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు సీహెచ్‌సీ వైద్యాధికారి గిడుతూరి వేణుగోపాలరావు తెలిపారు. రాజుకి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు సాత్విక్, ధనుష్ ఉన్నారు. మౌనిక ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామారావు తెలిపారు. ఇదిలావుంటే జిల్లాలోనే అత్యంతప్రశాంత పట్టణంగా పేరొందిన పాతపట్నంలో ఇలాంటి ఘటన జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అనారోగ్యంతో దివ్యాంగ విద్యార్థి..


సందీప్(ఫైల్)

మెళియాపుట్టి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బానాపురం గ్రామానికి చెందిన దివ్యాంగుల విద్యార్థి అగ్గల సందీప్(9) మెళియాపుట్టి జిల్లాపరిషత్ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో గురువారం మృతి చెందినట్టు హెచ్‌ఎం ఝాన్సీ తెలిపారు. ప్రతి బుధవారం భవిత కేంద్రానికి వచ్చి ఫిజియోథెరి చేయించుకునేవారన్నారు. ఈ విద్యార్థికి వినికి యంత్రంతోపాటు గ్రామం నుంచి పాఠశాలకు వస్తున్నందున ప్రతి నెల రూ.3 వేలు ఇచ్చేవాళ్లమన్నారు. అయితే తల్లికి వందనం డబ్బులు వచ్చినప్పటికీ పింఛన్ కోసం గత రెండేళ్ల నుంచి తిరుగుతున్నా మంజూరు కాలేదని సందీప్ తల్లి పార్వతి ఆవేదన వ్యక్తచేసింది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

ఇచ్ఛాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి బెల్లుపడ పాత టోల్‌గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన రాజేంద్రప్రసాద్ చౌదరి(69) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బౌద్ధ టౌన్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ తన స్వగ్రామం కాశీనగర్ దగ్గర కొల్లహరిపురం వచ్చేందుకు గురువారం ఉదయం తన జీప్‌లో బయలు దేరాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా బెల్లుపడ పాత టోల్ ప్లాజా వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన ట్రిప్పర్ ఢీకొనడంతో రాజేంద్రప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఏఎస్‌ఐ చక్రధర్ తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సరుబుజ్జిలి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తురకపేట గ్రామానికి చెందిన గదిలి రమణమూర్తి (52) భార్యతో మనస్పర్థల కారణంగా మనస్థాపానికి గురై బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న రమణమూర్తిని గమనించిన భార్య వెంటనే 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించింది. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. బుధవారం రాత్రి విశాఖపట్నం తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై సరుబుజ్జిలి ఎస్‌ఐ హైమావతి కేసు దర్యాప్తు చేసున్నారు.


ఒడిశా టు మహారాష్ట్ర

- 10.18 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా నుంచి మహారాష్ట్రలోని హింగోళి జిల్లాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హింగోలి జిల్లా అసోలా టర్ఫీ ఔండా గ్రామానికి చెందిన విశాల్ రమేష్ కీర్తనే ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేసే వరుసకు అన్నయ్య అయిన గణపత్ కీర్తనేను కలిశాడు. దీంతో ఒడిశా నుంచి గంజాయి తెస్తే కిలోకి రూ.1000 ఇస్తానని చెప్పాడు. ఇందుకు విశాల్ రమేష్ ఒప్పుకున్నాడు. అయితే ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ప్రాంతానికి చెందిన జిత్తును గురువారం కలిసి 10.18 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దీనిని బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అక్కడ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా ఎం.తోటూరు రైల్వే ఎల్‌సీ గేటు వద్ద రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తనిఖీలు చేయగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. దీంతో వాటిని సీజ్‌చేసి విశాల్ రమేష్ కీర్తనేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నమనాయుడు, రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాబా పాదుకలను దర్శించుకున్న భక్తులు


బాబా పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

పలాస, ఆగస్టు 7(ఆంధజ్యోతి): షిర్డీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిమోన్ నుంచి బాబా పాదుకలు గురువారం స్థానిక షిర్డీసాయి ధ్యాన మందిరంలో భక్తుల దర్శనారం ఉంచారు. ఈ మేరకు అధిక సంఖ్యలో భక్తులు బాబా పాదుకలు దర్శించుకొని తరించారు. 1898లో బాబా భక్తుడు నానా సాహెబ్ నిమోన్కర్‌కు ఆయన వినియోగించే పాదుకలను ప్రతిరూపంగా ఇచ్చి పూజించుకోవాలని కానుకగా ఇచ్చారు. నిమోన్కర్ వాటిని గ్రామంలోని తన నివాసంలో గల పూజామందిరంలో పెట్టుకొని పూజించారు. ఆ పాదుకలను స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని బాబామందిరంలో భక్తుల దర్శనార్థం ఉంచనున్నట్టు తెలిపారు.

ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరవాలి

ఎల్‌ఎన్ పేట, ఆగస్టు 7(ఆంధజ్యోతి): ప్రతీ ఒక్కరూ బీమా సౌకర్యం పొందాలంటే బ్యాంకుల్లో ఖాతాలను ఓపెన్ చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ నారాయణ తెలిపారు. బొడ్డవలసలో గురువారం జనసురక్ష, అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు.

శిథిలావస్థలో జీసీసీ గోదాములు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది


హిమగిరిలో గోదాం దుస్థితి


లొత్తూరులో జీసీసీ గోదాం ఇలా..

పలాస రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి ఏర్పాటు చేసిన జీసీసీ గోదాములు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పలాస మండలం హిమగిరి, లొత్తూరు గిరిజన గ్రామాల్లో జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన గోదాములు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, గోడలు, స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఇక్కడి నుంచే నిత్యావసర సరుకులు పంపిణీ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులు కూడా చేయించకుండా వదిలేశారు. సరుకులు ఉంచేందుకు కూడా సరైన స్థలం లేకపోవడంతో ఇరుకుగదుల్లోనే వాటిని ఉంచాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాకాలం కావడం, గదులు కారుతుండడంతో సరుకులు తడిచి పాడిసిపోయే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోదాములు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

శ్రీకాకుళం సాయుధ పోరాటం ప్రత్యేకం

- ఈ పోరులో చిరస్మరణీయురాలు సురేఖపాణిగ్రాహి
- విప్లవ రచయితల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ


గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

పలాస రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశంలో సాయుధ పోరాటాలు ఎన్ని జరిగినా శ్రీకాకుళం విప్లవ సాయుధ పోరాటానికి ఓ ప్రత్యేకత ఉందని విప్లవ రచయితల సంఘరాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ అన్నారు. అటు పోరాటం, ఇటు జముకుల కళ ద్వారా కవి సుబ్బారావుపాణిగ్రాహి ప్రజలను చైతన్యపర్చారని, ఆయన పోరాటానికి సురేఖపాణిగ్రాహి బాసటగా నిలిచి చిరస్మరణీయురాలయ్యారని అన్నారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో గురువారం సుబ్బారావుపాణిగ్రాహి సతీమణి సురేఖపాణిగ్రాహి సంతాపసభ నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన కృష్ణ మాట్లాడుతూ.. సుబ్బారావు పాణిగ్రాహి పోరాటంలో అమరుడయ్యారని, ఆయన ఆశయాలను సురేఖ పాణిగ్రాహి ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ప్రస్తుతం మధ్యభారతంలో సహజ సంపదను కొల్లగొట్టేందుకు కేంద్రం యత్నిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరిట అమాయకులైన ఆదివాసీలపై యుద్ధం సాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల సంఘం జిల్లా సభ్యుడు తామాడ త్రిలోచనరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక కళామండలి నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, రైతుకూలీ సంఘ నాయకులు వర్మ, సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు హరనాథ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సంఘ సభ్యులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం

నందిగాం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దిమిలాడ గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి బాలక శ్రీరామ్‌చరణ్‌కు రాజమండ్రి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు గురువారం లఖిదాసుపురం జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయుల చేతులు మీదుగా దివ్యాంగ విద్యార్థిక రూ.6 వేలు అందించారు. టెక్కలి డిప్యూటీ డీఈవో పనిచేసిన వాసుదేవరావు అప్పట్లో పాఠశాల తనిఖీలో భాగంగా శ్రీరామ్‌చరణ్ ఏటా రూ.5 వేలు అందిస్తానని ప్రకటించారు. ఆ మేరకు డీఈవోగా వేరే ప్రాంతానికి వెళ్లినప్పటికీ తన మాటను నిలబెట్టుకుంటూ సహాయాన్ని అందించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నందిగాం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలసలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు సలాన జోగేంద్రనాయుడు, ఎం.రాముల, ఎస్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పెద్దతామరాపల్లి యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ పి.దీప్తిరేఖ పాల్గొని పలు అంశాలపై వివరించారు.

శిలాఫలకాలు ధ్వంసం చేసిన దుండగులు


అల్లిమెరక వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం

హరిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల పంచాయతీ అల్లిమెరక, నారాయణపురం పంచాయతీ మల్లేనవారిపేట గ్రామాల వద్ద పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష సుమారు రూ.కోటి వ్యయంతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికిగాను అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శిలాఫలకం పైభాగం మొత్తం పాడైపోయింది. ఎమ్మెల్యే శిరీష ఫొటోలను గునపాలతో పొడిచి తొలగించారు. ఇది వైసీపీ కార్యకర్తల పనేనని టీడీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అధికారులతో గురువారం సాయంత్ర సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు పాల్గొంటారని, ఈ నేపథ్యంలో అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పీడీ ఎం.రోజా, డీడీ అన్నదొర, తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, గిరిజన సంఘ నాయకులు ఐదు మండలాల చెందిన వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఎంపీడీవోలను, ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో నాలుగు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, పీఆర్ ఇంజనీరింగ్, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్, డ్వామా అధికారులతో సమీక్షించారు. నేరేగా నిధులతో చేపడుతున్న పనులను పూర్తి చేసి బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటప్రసాద్, ఏఈ బగ్గు నర్సింగరావు, ఏపీవో యుగంధర్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస, ఆగస్టు 7(ఆంధజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. చేనేతరంగం మన దేశ గొప్ప సంస్కృతిక వారసత్వానికి చిహ్నమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలకు జీవనోపాధిగా నిలుస్తోందని, చేనేత కార్మికుల్లో అనేక మంది మహిళలలే ఉండడం మహిళాసాధికారితకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చేనేత వస్త్రధారణపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గణపతిరావు, పి.వెంకటరమణ, కె.గిరిజ, సునీత పాల్గొన్నారు.

రమేష్ యాదవ్‌పై దాడికి నిరసనగా ర్యాలీ

టెక్కలి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు పృధ్వీరాజ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మార్పు అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చకచకా బెండి-బెండిగేటు రోడ్డు పనులు

- మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం



బెండిగేటు- బెండి గ్రామాల వద్ద జరుగుతున్న పనులు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మూడేళ్లపాటు నిలిచిపోయిన బెండిగేటు నుంచి బెండి వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభం అయ్యాయి. సీఆర్ఎఫ్ (సెంట్రల్ రోడ్డు ఫండ్) నిధులు గత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో.. బిల్లులు అందక కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు గోతులలో పల్టీకొట్టి ప్రమదాలు జరిగాయి. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయమై నడవడానికి కూడా ప్రజలు అవస్థలు పడ్డారు. సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా బెండి తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థులు గౌతు శిరీష, కింజరాపు రామ్మోన్నాయుడు ప్రచారం చేశారు. ఈసందర్భంగా రోడ్డు పనులు నిలిచిపోవడంతో పడుతున్న ఇబ్బందులు స్థానికుల విన్నవించగా.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డుపనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే బెండి గ్రామం వద్ద ఈ పనులకు ఎమ్మెల్యే గౌతు శిరీష భూమిపూజ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వారం రోజులుగా రోడ్డు విస్తరణ పనులు చకాచకా సాగుతున్నాయి. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ జేఈ విక్రం మాట్లాడుతూ మొదటి విడతగా బెండిగేటు నుంచి బెండి వంతెన వరకు బీటీ రోడ్డు పనులు వారంలో పూర్తి చేస్తామన్నారు. రెండోవిడతలో మిగిలిన పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

మెట్టూరు ఆసుపత్రికి స్థల పరిశీలన

కొత్తూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మెట్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. మెట్టూరు బిట్-1 నేరడి రెవెన్యూ పరిధిలో సుమారు 1.40 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వం ఆసుపత్రికి కేటాయించింది. స్థలంపై కొంతమంది కోర్టుకు వెళ్ల డంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ భవనాలు లేక సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు చెందేవారు సమస్య పరిష్కారానికి ఆర్డీవో కలగజేసుకొని కోర్టులో దావా వేసినవారిని ఒప్పించి, కేసు ఉపసంహరించేలా చేయించి, రాజీ మార్గం చేయడంతో ఆసుపత్రి నిర్మాణపు పనులకు అడ్డంకి తొలగినట్టేనని ఆయన తెలిపారు. అనంతరం నివగాంలో నాళా బదలాయింపు స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవోతో పాటు కొత్తూరు తహసీల్దార్ కె.బాలకకృష్ణ, ఎంఎస్ గవరయ్య పాల్గొన్నారు.

వరుణుడి కోసం పూజలు


గుంజుమెట్ట పై పూజలు చేస్తున్న రైతులు

జలుమూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండిపోతున్నాయి. చల్లవానిపేట కూడలికి సమీపంలో గల గుంజుమెట్టవద్ద చల్లవానిపేట, పంగవానిపేట గ్రామాలకు చెందిన రైతులు వరుణ దేవుని కరుణ కటాక్షాలు కోసం గురువారం సాయంత్రం వరదపాసం పూజలు చేశారు. గ్రామ పురోహితులు అక్కాజోష్యుల రాజశేఖర శర్మ నేతృత్వంలో గుంజుమెట్ట వద్ద వరుణ దేవునికి పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన చేసి వరుణ దేవునికి పూజలు చేశారు. పూజానంతరం రైతులు పాయసాన్ని పంచిపెట్టి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరారు. కార్యక్రమంలో చల్లవానిపేట, పంగవానిపేట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వాటర్ ఫ్రిజ్ వితరణ

జలుమూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థిని డాక్టరు బసవ రాజనందిని వాటర్ ఫ్రిజ్ వితరణగా అందించారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలకు తాగునీటి అందించేందుకు హెచ్‌ఎం చింతాడ సత్యనారాయణకు గురువారం దీనిని అందించారు. మరింతమంది దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు ఉపయోగపడే పరికరాలు వితరణగా అందించి హెచ్‌ఎం కోరారు.

పలాసలో ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

పలాస, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన ఎస్పీ గ్రీవెన్స్ రద్దు చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం, కాశీబుగ్గలో ప్రతి శుక్రవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుంది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రభుత్వం సెలవు దినం ప్రకటించడంతో గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే శుక్రవారం యథాతథంగా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

హిరమండలం ఏఎంసీ వైస్ చైర్మన్‌గా కృష్ణమాచారి


కృష్ణమాచారి

ఎల్‌ఎన్ పేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపేట గ్రామానికి చెందిన కొవిలాపు కృష్ణ మాచారి హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఏఎంసీ కార్యదర్శి ఎం.కాళేశ్వరరావు గురువారం తెలిపారు. కాగా రెండు రోజుల కిందట జరిగిన పీఏసీఎస్ చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అప్పుడే కృష్ణమాచారిను ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి తాను పార్టీ ఉన్నతికి కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

లైన్‌మన్ కాదు.. సేల్స్‌మనే!


విద్యుత్ స్తంభం ఎక్కి సెల్‌ఫోన్ కడుతున్న జీసీసీ సేల్స్‌మన్

టెక్కలి రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో విద్యుత్ స్తంభం ఎక్కితున్న వ్యక్తి లైన్‌మన్ అనుకుంటే మీరు పొరబడినట్టే.. ఎందుకంటే ఈయన లైన్‌మన్ కాదు జీసీసీ డిపో సేల్స్‌మన్. నరహరిపురం జీసీసీ డిపో ద్వారా సరకులు పంపిణీలో నెట్‌వర్క్ సమస్య వల్ల ప్రతిరోజూ ఈ అవస్థలు తప్పడం లేదు. దీంతో ఆ డిపో సేల్స్‌మన్ నారాయణరావు ఇలా విద్యుత్ స్తంభం ఎక్కి సెల్ కట్టి అక్కడ నుంచి వైఫై కనెక్ట్ చేసి లబ్ధిదారుల తంబ్‌లు వేసి సరుకులు ఇస్తున్నాడు. ఇది నిత్య కృత్యంగా మారింది.

హర్‌ఘర్ తిరంగా అభియాన్ మనందరి బాధ్యత

కోటబొమ్మాళి, ఆగస్టు 7(ఆంధజ్యోతి): దేశ సమైక్యత కోసం హర్‌ఘర్ తిరంగా అబియాన్ బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు, జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు మెట్ట తిరుమలరావు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10, 11, 12వ తేదీల్లో యువత, మహిళలతో తిరంగా యాత్ర చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే 13, 14 తేదీల్లో స్వాతంత్ర్య పోరాట స్మారక చిహ్నాలు, యుద్ధ స్మారకాలను శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతాయన్నారు. 13 నుంచి 15 వ తేదీ వరకు ప్రతీ ఇంటిపైనా, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగురవేయాలని ఆయన పిలుపు చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

పోలాకి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం వెనుకబడిన బాలుర వసతిగృహంలో ఫ్రెషర్స్ డేను గురువారం వసతిగృహ ప్రత్యేకాధికారి పొదిలాపు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా వసతి గృహంలో ఈ సంవత్సరం నుంచి కొత్తగా ప్రవేశించిన విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికి ఆత్మీయత చాటుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ సుంకరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శివారు ఆయకట్టుకు నీరు ఇవ్వాలి

పలాసరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వంశధార ఎడమ కాలువ శివారు ప్రాంతాలకు నీరు అందివ్వాలని జనసేనపార్టీ సమన్వయకర్త దుర్గారావు చీఫ్ ఇంజనీరు కె.నర్సింహమూర్తిని గురువారం కోరారు. విజయవాడ జలనవరుల శాఖ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరులశాఖ ఇంజనీరుచీఫ్ నర్సింహమూర్తిని కలిసి వంశధార ప్రధాన ఎడమ కాలువ చివరి ఆయకట్టలో గల పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 18వేల 228 ఎకరాలకు నీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. జూలై2న గొట్టాబ్యారేజ్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసినా నేటికీ శివారు ఆయకట్టుకు అందలేదన్నారు. దీనిపై అవసమరైన చర్యలు తీసుకోనున్నట్టు చీఫ్ ఇంజనీర్ తెలిపారు.

వర్షంతో రైతుల్లో హర్షం

హరిపురం, ఆగస్టు 7(ఆంధజ్యోతి): గత కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బందిపడుతున్న జిల్లా వాసులకు కాస్త ఉపశమనం కలిగింది. గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కళింగదల్, డబార్సింగి, దామోదర సాగర్, సునాముది, సంకుజోడి, మహేంద్రతనయ వంటి సాగునీటి వనరుల్లో కనీస స్థాయిలో నీరులేని దుస్థితి నెలకొంది.

- మెళియాపుట్టి: ఎట్టకేలకు గురువారం సాయంత్రం వర్షాం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేయడం కనిపిస్తుంది. గత నెల రోజులు నుంచి చినుకు జాడలేక వరి నాట్లు వేయని పరిస్థితి కనిపించింది. చాపర, మెళియాపుట్టి, మర్రిపాడు, పట్టుపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

